

# మూడు కాకులు రెండు ముక్కలు

వి. యస్. రావు

ఆదిశేషు సంచీ చేత పట్టుకొని వీధిలో పడ్డాడు బియ్యం కొనటానికి. మాసిన చొక్కా జేబులోని 5 రూపాయల నోటుని మరొక సారి తడుముకొని మార్కెట్ జంక్షనుకి బయలుదేరాడు. నెలాఖరు సమయంలో 5 రూపాయల అప్పు అష్టకష్టాలు పడి సంపాదించ గలిగాడు. మార్కెటులో గవర్నమెంటువారు ఆదిశేషు లాంటి "ప్రజలకి" చౌకరకానివి బియ్యం తలకి రెండు కిలోలు వంతున యిస్తున్నారట. "లూప్ యూజ్ ఓన్లీ ద హోప్" అనే స్లోగాను అసలు పరుద్దామనుకొనే వేళకే ఆదిశేషుకి 5 గురు పిల్లలు పుట్టినారు. ఈ రెండు కేజీల బియ్యం 1 రోజుకే నా పిల్లలకి పెట్టడానికి రాదే అనుకొన్నాడు. అందుకే అతనికి ఇందిరాగాంధీ సోషలిజం అన్నా, భవిష్యత్తన్నా చాలా భయం.

బియ్యం కొట్టుదగ్గరకి చేరేసరికి ధర్మదర్శనానికి వెంకటేశ్వరుని కోవెల దగ్గర నిలబడ్డట్టు జనం బారులు తీర్చి నిలబడ్డారు. వీళ్ళందరూ సూర్యుడు తూర్పు కొండల నుండి తొంగి చూడక ముందే కళ్ళు నులుపుకొని వచ్చేరనుకొన్నాడు. అతని ఆలోచన కరెక్ట్ అన్నట్టు ఒకాయన పుల్లతో పళ్ళు తోముకొంటున్నాడు. ఇక నేను బియ్యం యింటికి పట్టికెళ్ళేసరికి సాయంకాలం 4 గం. అవడం ఖాయం అనుకొని ఉసూరుమంటూ లైను చివర నిలబడ్డాడు. ఇందిరమ్మ "గరీబీ హటావో" సూత్రానికి యిది ప్రాతిపదిక గాబోలు ననుకొన్నాడు.

దుకాణం ఎన్ని గంటలకి తెరుస్తారండీ? ఒక మూర్ఖుని ప్రశ్న.

దుకాణం కొట్టువాని యిష్టా యిష్టములతో అని తెలియదు కాబోలు.

అయ్యా ధర్మం చేయండి! అమ్మా ధర్మం చేయండి! ఒక బిక్షగాని కాకి గోల. వెళ్ళవయ్యా, వెళ్ళు. మేము కూడా నీ లాగే సంచి పట్టుకొని యిక్కడ 2 కేజీల బియ్యం ముష్టికి ప్రొద్దున్న నుండీ చస్తున్నాం. నువ్వు నోరుపెట్టి గట్టిగా అరుస్తున్నావు. మేము సిగ్గుతో అరవలేక ఊరుకొన్నాం. ఇదే నీకూ మాకూ తేడా. అన్నాడు కసితీరా ఒక పెద్దమనిషి. ముష్టివాడు నిస్సహాయంగా సణుగుకొంటూ వెళ్ళిపోయాడు. ఇంతలో షాపు కుర్రవాడుట ఒకడు వచ్చి తలుపులు తెరిచాడు. జనం ఎగబడ్డారు. ఒకరి నొకరు త్రోసుకుంటున్నారు. ఒకరి పాదాలొకరు ఆకలితో త్రొక్కుకుంటున్నారు. బలహీనులు వెనుక పడ్డారు. బలవంతులు ముందుకు వచ్చారు. ఆగండయ్యా ఆగండి! ఇంకా షాపు తుడవాలి. అసలు బిల్లు గుమస్తా యింకా రావాలి! అంటూ కసిరాడు షాపు కుర్రవాడు. ఓరి వీడి దుంపతెగ! వీడికెంత పవరు యిచ్చిందిరా గవర్నమెంటు. ఎప్పుడో వీడు కూడా ఒక "యాహ్యాఖాను" అవుతాడేమో.

శ్రీరామచంద్రా నారాయణ! ఎన్ని కష్టాలొచ్చాయిరా నాయనా! ఒక భక్తుని మొర. ఒన్స్‌మోర్! ఒక ప్రేక్షకుని కోరిక.

ఇక్కడ దగ్గర్లో మంచినీళ్ళు దొరుకుతాయా నాయనా! ఒక బామ్మగారి ప్రశ్న. కొళాయుంటూ యుంది గాని నీళ్లుంటాయో యుండవో తెలీదు. అదీ గాక జాగా వదిలి వెళితే తిరిగి దొరుకుతుందని గ్యారంటీలేదు. మామ్మజీ.

ఆ ఖరుకి రానే వచ్చాడు బిల్లు గుమస్తా. శెట్టిగారూనూ. పేదల పాలిట కామధేనువూ. కల్పతరువూ యింకా ఏమిటేమిటో వారి బిరుదులు. (ఓ) బాబూ! లైనులో నిలబడండి. అసలే అది వేసవికాలం. మీద పడితే పని జరగదు. శెట్టికారి ఆజ్ఞ. శెట్టి ఆకారాన్ని, నొదుటిమీద నున్న మూడు నామాల్ని చూసేసరికి "వెంకటేశ్వరుడి రూపం" పైసా ఖర్చు లేకుండా కనబడినట్లయింది ఆదిశేషుకి. క్యూ మెల్లిగా ముందుకు సాగుతుంది.

అదేమిటండీ శెట్టిగారూ! బియ్యం, యిలా ఉన్నాయేమిటి! వాటినిండా తవుడూ రాళ్ళూ, పెంకు పురుగులూనూ.

ఏమండీ! ఇది మా బాబు పండించినవి కావు. గవర్నమెంటువాళ్ళు మీలాంటి వాళ్ళకి పంచమని యిచ్చేరు. మేం పంచుతున్నాం. ఇష్టముంటే పట్టుకెళ్ళండి. కష్టమయితే "దంపుడు బియ్యం" సప్లై చేయమని పదిమందీ కలిసి ప్రభుత్వానికి ఒక అర్జీ పెట్టండి.

నాయనా! ఇచ్చే రెండు కేజీలు బియ్యమేనా సరిగ్గా తూచి యివ్వు. సగం క్రింద. సగం సంచిలోనూ. అదేమిటి. ముల్లు తిన్నగా నిలబడకుండా చలిజ్వరం వచ్చినట్లు అలా వణుకుతుం దేమిటి?

అమ్మా! మీలాంటివాళ్ళు కొన్ని వందల మంది లైనులో నిలబడారు. తొందరగా కదలండి. ఒక్కొక్కరి దగ్గరే అరగంట ఆలస్యము అయితే, యింతమందికి ఎలా యివ్వడము? అందుకే నాకీ పంపకం యివ్వొద్దు బాబూ అంటే మళ్ళీ నాకే యిచ్చారు, యీ పాడు గవర్నమెంటువాళ్ళు. పైసా లాభం లేదుగానీ పదిమందిచేత రోజూ చీవాట్లు తింటున్నాను. ఖర్మ! శెట్టిగారి గోల.

బాబూ! చిల్లర తీసుకొనిరండి. ఇక్కడ నా దగ్గర చిల్లర లేదు. చిల్లరలేనివాళ్ళు చీటీ వెనకాల రాయించుకొని మళ్ళీ రేపు ప్రొద్దున్న రండి. అమ్మా....తల్లీ! ఈ నోటు చెల్లదు. దీన్ని ఏ కొబ్బరినూనెలోనో, కిరసనాయిలు

(మిగతా 29వ పేజీలో)

# మనుషులు కాకులు రెండు కుక్కలు

[16వ పేజీ తరువాయి]

లోనే ముంచితే ఎలా చెప్పండి? మరొకటి యిచ్చుకోండి.

శెట్టిగారూ! యిది తప్ప నా దగ్గర యింకొకటి లేదు. తీసుకోండి మీకు పుణ్యముంటుంది. ఆదిశేషు దీనాలాపన.

అయ్యా! తమలాంటి "పెద్దవాళ్ళ" ఇనప్పెట్టెలలో భద్రంగా, క్రొత్తగా నోట్లున్నట్లు, మా లాంటి పేదవాళ్ళ చేతుల్లో ఎలా యుంటాయండి. తీసుకోండి బ్యాంకులో తరువాత యిచ్చేయొచ్చు అన్నాడొక పెద్దమనిషి. శెట్టి గబుక్కున అందుకుంటూ నోటు తీసుకొని గల్లా పెట్లో వేసుకొన్నాడు.

నేనలా బయటకు వెళ్ళొస్తానోయ్! జాగ్రత్తగా చూసుకో నిన్నొకడిలాగా 20 రూపాయలు నష్టం వచ్చింది. గోనెకూడా తిరిగి యిచ్చేయమంటుంది గవర్నమెంటు. యీ నష్టం ఎవరు భరిస్తాడో అంటూ కదిలాడు బయటకి.

ఆదిశేషు కాళ్ళు లాగుతున్నాయి. ఎదురుగుండా కాఫీ హోటలు ఆహ్వానిస్తోంది. వెళితే జాగా పోతుందేమో నని భయం. అరగంటలో తనవంతు వస్తుంది అనుకున్నా అంతదాకా ఆత్మారాముణ్ణి గోల చెయ్యొద్దని ప్రతిమాలుకున్నాడు. యీ క్యూ వెంటనే తొందరగా కదల్దు. ఎండ ముదిరి పోతోంది అనుకున్నాడు. ఎదురుగా మున్సిపాలిటీ చెత్తకుండీలోకి మేడమీద నుండి ఎవరో ఎంగిలి విస్తర్లు కట్ట విసిరారు. వెంటనే మూడుకాకులు ఆకులలోని మెతుకులు తిండానికి కుండీమీద వ్రాలాయి. ముక్కులతో కన్నం పొడిచి మెతుకులు తిందామనుకునే లోగా ఎక్కణ్ణించో ఒక కుక్క అరుస్తూ వచ్చి కుండీమీదకి ఎగిరింది. కాకులు ఎగిరిపోయి ఎదురుగా వున్న చెట్టు కొమ్మ మీద వాల్చాయి కుక్క తినగా మిగిలిన మెతుకులు తిందామని ఆశతో చూస్తున్నాయి.

ఏమండీ! అంటూ ఒక పదేళ్ళ కుర్రవాడు ఆదిశేషు చేయి పట్టాడు. ఆదిశేషు వెంటనే జేబులు తడిమి చూసుకొని ఏమిటన్నాడు. ఇక్కడవారు దగదగా బియ్యం మంచి రకానివి ఒక పావలా ఎక్కువకి అమ్ముతున్నాడు. యీ క్యూలో నిలబడి బాధపడేకంటే తొందరగా కొనుక్కొని పోవచ్చు అన్నాడు పిల్లగా.

ఆదిశేషు సంచి పట్టుకొని కుర్రవాడి వెనకాల బయలుదేరాడు. కుర్రవాడు రెండు సందులు త్రిప్పి ఒక చోటుకి తీసుకెళ్ళాడు. అక్కడ మన చౌక డిపో శెట్టిగారు తన గారపళ్ళని బయటపెట్టి నవ్వుతూ ప్రజలని ఆహ్వానిస్తున్నారు. ఇక్కడ కూడా "బ్లాక్ మార్కెట్" ఉందా బాబూ అనుకొన్నాడు. అప్పటికే యిద్దరు తనలాంటి వాళ్లు కొట్టు దగ్గర నిలబడి యున్నారు. రండి రండి ఒకటోరకం బియ్యం. అక్కడకన్న కేజీ మీద ఒక అర్ధరూపాయి ఎక్కువ. యీ కాలంలో డబ్బు విలువ తగ్గిపోయిందండి. వస్తువులే విలువ. తొందరగా తీసుకొని వెళ్లండి. తక్కువగా వున్నాయి బియ్యం. ఈ రకం యింకెక్కడా దొరకదు అన్నాడు శెట్టి ఆదిశేషుని చూసి.

ఆదిశేషు బస్తాలోని బియ్యం చూశాడు. చవకడిపోలోని బియ్యంలాగే వున్నాయి. 5 రూ. నోటు యిచ్చి రెండు కేజీల బియ్యం సంచిలో పొయ్యమన్నాడు. శెట్టిగారు బియ్యం తూచి చిల్లర డబ్బులు యివ్వబోయే సరికి ఎక్కణ్ణుంచో యిద్దరు వ్యక్తులు వచ్చి శెట్టిగారి చెయ్యి పట్టుకొన్నారు.

శెట్టిగారూ! బియ్యం అక్రమంగా హెచ్చు ధరకి అమ్ముతున్నందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం. పదండి స్టేషనుకి అంటూ బయటకు తీసుకొచ్చారు శెట్టిగార్ని. ఆదిశేషు చేతిలోని బియ్యం తీసుకొని అతనికి 5 రూ. యిచ్చి పంపేశారు. కొట్టుకి తాళంవేసి, సీలు చేసి, శెట్టిగార్ని వీధిలోనికి యీడ్చుకొచ్చేరు.

ఆదిశేషు, పాపం శెట్టిగారు! అనుకొని చవకడిపో దగ్గర బియ్యం కోసం మళ్ళీ నిలబడదామని బయలుదేరేడు. కాని, అక్కడి జనం చెల్లాచెదురై వెళ్ళిపోతున్నారు. ఒకాయనను పిలిచి కారణమడగగా "స్టాకు" అయిపోయిందిట అని చెప్పాడు. పాపం ఆదిశేషుకేం తెలుసు. యజమాని అరెస్టు వార్త కుర్రవాడు చెప్పగానే బిల్లు గుమాస్తా స్టాకు అయిపోయిందని దుకాణం మూసేసేడని. ఆదిశేషు నిరాశగా చూస్తూ నడుస్తూ వుండగా దూరాన్న విస్తరాకులలోని ఎంగిలి మెతుకులు తింటున్న కుక్కమీదికి మరొక కుక్క వచ్చి పడింది. కాని దానికి మిగిలింది ఖాళీ విస్తరాకులే. కొమ్మమీద నున్న కాకులు ఆకలితో యిహ లాభం లేదని ఎగిరిపోయాయి. ఆదిశేషు కలెక్టరుకి రిపోర్టు చేద్దామనుకొన్నాడు. దూరాన్న రేడియో నుంచి.

"ఆకలయి అన్నమడుగుతే
పిచ్చోళ్ళన్నారు నాయాళ్ళు!
కడుపుమండి న్యాయమడిగితే
వెర్రోళ్ళన్నారు నాయాళ్ళు!

అని పాట వినబడేసరికి ఆ ప్రయత్నం విరమించుకొన్నాడు.

---

# ఉగాది వర్ణచిత్రం!

**కొడిమెల శ్రీరామమూర్తి**

రావమ్మా ఉగాదీ!
క్రొత్తఆశలకు పునాదీ!
ఓ ఆనంద ఉగాదీ!
సామాన్యుని స్థితిగతులు
చిత్రగించవచ్చావా?
మూలిగేనక్కమీదతాటికాయపడింది!
బడ్జెట్ బరువుతో
మనిషినడుము విరిగింది!
రాకెట్ వేగంతో
టూత్‌పేస్ట్ పెరగడంతో
బ్రష్షులన్నీ అటకలెక్కి
వేపపుల్లలు,
బొగ్గుపొడులు చేతికొచ్చాయి!
పావురాయిటపా
ప్రవేశపెట్టాలి మళ్లానేడు!
కారుధర ఎంతో పెరిగిందిచూడు!
చీకటి బజార్లలోని తోడేళ్ళకు
ఆకలి నానాటికీ ఎక్కువవుతోంది!
ఆ చెలగాటంతో
సామాన్యుడికి ప్రాణసంకట
మౌతోంది!
కనుమరుగైనవి అన్నీ
వెక్కిరింపు ధ్వనితో
వికటాట్టహాసం చేస్తున్నాయ్!
కల్తీలతో అవి
నిలువెల్లా కులుకుతున్నాయ్!
మనిషిని రోగగ్రస్తుణ్ణి చేస్తున్నాయ్!
రోగాన్ని విరగడచేసే మందులే
ఎన్నెన్నో కల్తీలతో
కొత్త కొత్త రోగాలను
మెత్త మెత్తగా అంటిస్తున్నాయ్!
బ్రతికేందుకు తిండి
ఒంటికి చుట్టేబట్ట
చదివే చదువూ
నేడు భోగవస్తువులై పోయాయ్!
పీల్చేగాలి మాత్రం
ధరలేకుండా దొరుకుతోంది—
అంతో యింతో యంత్రాల ఎంగిలితో,
రంగులు వెలిసిపోయిన
సామాన్యుని జీవిత తైలవర్ణ
చిత్రాన్ని చూసి
ఉలిక్కిపడుతున్నావా
ఉగాదీ!
ఆనందాన్ని ధరించిన నువ్వు
జనానికి ఎంతోకొంత
ఆనందాన్ని పంచుతావా?
నవ్వడం మరిచిపోయిన
నేటిమనిషికి
పకపక నవ్వడం నేర్పుతావా?
రావమ్మా ఉగాదీ!
క్రొత్తఆశలకు పునాదీ!
ఓ ఆనంద ఉగాదీ!